# ప్రజలకు అందుబాటులో ఉంటా

- ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానించిన మై హోమ్ అవతార్, హాల్మార్క్ వీసినియా అసోసియేషన్ సభ్యులు



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మై హోమ్ అవతార్, హాల్మార్క్ వీసినియా అసోసియేషన్ సభ్యులు

మణికొండ, డిసెంబర్ 19: నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అహర్నిశలు పని చేస్తానని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో నాలుగోసారి భారీ మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను మై హోమ్ అవతార్, హాల్మార్క్ వీసినియా అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు వరుసగా నాలుగుసార్లు గెలిపించారన్నారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకానికి పదిరేట్లు కష్టపడి పని చేస్తానన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వం పరంగా వచ్చే ప్రతి పథకాన్ని అర్హులైన ప్రజలకు అందించేందుకు పాటుపడతానన్నారు. ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తేవాలన్నారు. అప్పుడే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు వీలు ఉంటుందన్నారు. ప్రజా సేవకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్, డిసెంబర్ 19: ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మంగళవారం ఆజంపురా డివిజన్‌లోని చంచల్‌గూడ ఉమర్ బిన్ ఖతాబ్ మసీదు రోడ్డు లో సీసీ రోడ్డు, సీవరేజీ పైప్ లైన్ పనులను ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో డివిజన్‌లలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం నేతలు షేక్ మొహియుద్దీన్ అబ్రార్ పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



ఏఈ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

బండ్లగూడ, డిసెంబర్ 19 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు విద్యుత్ అధికారి ఏఈ సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఅండ్‌టీ కాలనీలో విద్యుత్ సమస్యలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఓవర్ లోడ్, నూతన ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ తీగలను అమర్చకపోవడం, స్తంభాలను సక్రమంగా ఏర్పాటు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్ మార్జిన్‌ల పైన ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదని, విద్యుత్ తీగలకు ఆనుకొని ఉన్న చెట్టు కొమ్మలను తొలగించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీఅండ్‌టీ కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సయ్యద్ ఫిరాసత్ హుస్సేన్ ఉర్స్ నదీమ్, జనరల్ సెక్రటరీ అబ్దుల్ హఫీజ్, కుత్బుద్దీన్, హైదర్ అలీ తదితరులు ఉన్నారు.

## వాకింగ్ ట్రాక్ పనులు పరిశీలన



సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్బీహెచ్-ఏ కాలనీ మాదవ నిలయం పార్క్‌లోని వాకింగ్ ట్రాక్ పనులను మంగళవారం డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో అపరిష్కృతంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించటానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పార్క్‌లు కాలనీ వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ రాజ్‌కుమార్, వర్క్ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, సోదం రవి పాల్గొన్నారు. -సైదాబాద్, డిసెంబర్ 19

## 22న రైతుల ప్రాథమిక హక్కుల పై సమావేశం

చాదర్‌ఘాట్, డిసెంబర్ 19: రైతులు-ప్రాథమిక హక్కులు అనే అంశం పై శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు పౌర హక్కుల ప్రజా సంఘం(పీయూసీఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవింధ్యాల తెలిపారు. మలక్‌పేటలోని పీయూసీఎల్ కార్యాలయంలో 22న మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు-ప్రాథమిక హక్కులు అనే అంశం పై అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీయూసీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ సుప్రీం కోర్టు అడ్వకేట్ సీహెచ్.బాల కిషన్ సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలను డబ్బుతో తగ్గించవచ్చుని ప్రభుత్వాలు భావిస్తున్నాయని, ఇది అవగాహన లోపమని ఆమె దుయ్యబట్టారు.

## భూ సమస్యల పరిష్కారానికే న్యాయస్థానాలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 19 : రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం న్యాయస్థానాలు పని చేస్తాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అన్నారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని మల్కారంలోని రైతు వేదికలో వ్యవసాయ, న్యాయ, రెవెన్యూశాఖలు సంయుక్తంగా వ్యవసాయ న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా మాట్లాడుతూ రైతుల భూసమస్యల పరిష్కారం కోసం న్యాయస్థానాలు పని చేస్తాయని అందుకోసం రైతులు ఇబ్బందులు పడకుండా చిన్నచిన్న వివాదాలను పెద్దగా చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ప్యారా లీగల్ వలంటీర్లను బాల్‌రెడ్డి, కొన్నమొల్ల సంజీవ, శంకర్‌లను ఏర్పాటు చేశామని మండలంలోని రైతులు ఏదైన వివాదాలు ఉంటే వారిని సంప్రదించాలని సూచించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కోనుగోలు చేసే సమయంలో కచ్చితంగా రశీద్‌లు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్విరాజు, పీఏసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీశ్,ఎంపీడీవో వసంతలక్ష్మి, వ్యవసాయ అధికారులు లీనీరెడ్డి, కవిత,గ్రామ సర్పంచ్ మాధవి, బీఆర్‌ఎస్ రైతు విభాగం అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, నాయకులు రాజశేఖర్‌గౌడ్, సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణికాలనీలో డ్రగ్స్, గంజాయిని అరికట్టాలి



సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న గిరిజన బంజారా సంఘం నాయకులు

సైదాబాద్, డిసెంబర్ 19 : సింగరేణికాలనీ బస్తీలో డ్రగ్స్ విక్రయాలను అరికట్టాలని కోరుతూ మలక్‌పేట డివిజన్ ఏసీపీ, మలక్‌పేట ఎక్సైజ్, ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లకు మంగళవారం గిరిజన బంజారా సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణికాలనీ బస్తీ, వాంబే గృహసముదాయంలో నివాసముంటున్న విద్యార్థులు డ్రగ్స్, గంజాయికి బానిసల వుతున్నారని తెలిపారు. వాంబే గృహసముదాయంలో అద్దెకు ఉంటున్న కొంతమంది యువకులు, చదువుకుంటున్న విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి విక్రయిస్తున్నారని విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారన్నారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో పవన్‌నాయక్, గజనాయక్, శంకర్‌నాయక్, సంత్‌నాయక్, విజయ్ నాయక్ తెలిపారు.

## బూత్ స్థాయి అధికారులకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న బీఎల్వోలు

సైదాబాద్, డిసెంబర్ 19 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్బీహెచ్ కాలనీలోని పద్మావతి కల్యాణ మండపంలో బీఎల్‌వోలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల శిక్షణ తరగతులను ఎన్నికల నిర్వహణ నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు నియోజకవర్గం వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటికీ తిరుగుతూ నకిలీ ఓటర్ల గుర్తింపు, కొత్త ఓటర్ల నమోదు చేయాలని, అదే విధంగా ఇంటి చిరునామా మార్పు, పోలింగ్ కేంద్రాల మార్పు, ఫొటో మార్పులతోపాటు అన్ని అంశాలను నేరుగా ఓటర్లకు వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. 30మంది సూపర్‌వైజర్లు, 10మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. శిక్షణ తరగతుల్లో బీఎల్‌వోలకు ఎన్నికలకు సంబంధించిన అన్ని అంశాలపై, వాటిని సమన్వయం చేస్తూ శిక్షణ ఇవ్వటం జరుగుతుందని సైదాబాద్ తహసీల్దార్, మలక్‌పేట నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జయశ్రీ తెలిపారు.

## కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి



నర్కూడ గ్రామ సర్పంచ్ సిద్ధులుకు వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 19 : ఎస్టీ కమ్యూనిటీహాల్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం గిరిజనులు గ్రామ సర్పంచ్ సునిగంటి సిద్ధులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని నర్కూడలోని ఎస్టీ(గిరిజనులకు) కమ్యూనిటీహాల్‌తో పాటు స్థలం కేటాయించాలని కోరారు. నర్కూడ గ్రామంలోని ప్రభుత్వ దవాఖాన పక్కన ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలం గిరిజన(ఎస్టీ) కమ్యూనిటీహాల్‌కు కేటాయించాలని గిరిజన నాయకులు రాజునాయక్, నర్సింగ్‌రావు, హిర్య,శ్రీనివాస్‌లతో పాటు పలువురు కోరారు. ఎంపీటీసీ గౌతమి, ఉపసర్పంచ్ గడ్డం శేఖర్‌యాదవ్, వార్డు సభ్యులు వినోద్,యాదగిరి, కుమార్‌గౌడ్, ఇందిర పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే కష్టపడి చదవాలి



షేక్‌పేట్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మంగళవారం తానా అమ్మ,నాన్న, గురువు పద్యార్చన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ శతకం, నాన్న శతకం, గురువు శతకాలలోని పద్యాలను కంఠస్థం చేసి విద్యార్థులంతా సామూహికంగా పాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చైర్మన్ షరీఫ్ హాజరై ప్రారంభించారు. విద్యార్థి దశలోనే కష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ జైపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మధుకర్‌రావు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. -మణికొండ, డిసెంబర్ 19:

## ఆటోలు దగ్ధం.. కేసు నమోదు

బండ్లగూడ, డిసెంబర్ 19: చింతల్‌మేట్ ప్రాంతంలో వరుసగా ఆటోలు దగ్ధం అవుతుండటంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చింతల్‌మేట్ పరిధిలోని పలు బస్తీలలో పది రోజులగా ఆటోలు తగుల బడుతున్నాయి. ప్రతి రోజు ఆటో డ్రైవర్లు తమ ఆటోలను ఇంటి ముందు నిలిపి నిద్రింస్తుంటారు.అర్ధరాత్రి దాటిన తర్వాత ఆటోలకు మంటలు అంటుకోవడం పరిపాటిగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.